క్లుప్తంగా

ఏజీపీగా మహేశ్వరుడు



జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా మహేశ్వరుడు

నందికొట్కూరు: నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా మహేశ్వరుడును ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఏజీపీ మహేశ్వరుడు మా ట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి సహకారంతోనే పదవి వరించిందన్నారు.త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తానన్నారు.

కులగణనలో నిక్కచ్చిగా వ్యవహరించాలి

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మాల, మాదిగల కుల గణనలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించి జాబితా తయారు చేయాలని మాలమహానాడు రాష్ట్ర నాయకులు వేల్పుల సుంకన్న డిమాండ్ చేశారు. బుధవారం మాలమహానాడు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికారులు ఒక కులం వైపు మొగ్గు చూపరాదన్నారు. తమ మాల కులానికి అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఏసేహెచ్ నగేష్, మనోహర్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: మున్సిపాలిటీ పరిధిలో ప్యారడైజ్ వెంచర్‌లో ప్రజా అవసరాల కోసం వదిలిన మున్సిపల్ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు బుధవారం మున్సి పల్ కార్యాలయంలో కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. 2013లో ప్యారడైజ్ వెంచర్‌లో గుడి, బడి తదితర ప్రజా సౌకర్యాల కోసం వదిలిన స్థలా న్ని రిజిస్ట్రేషన్ చేసుకుని ఇతరులకు విక్రయించాని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పబ్లిక్ స్థలాన్ని అమ్మేసిని వారిపైనా, రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులపై కేసులు నమోదు చేయించాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, బాలస్వామి పాల్గొన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం



మహానందీశ్వరస్వామి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు బుధవారం కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలు చేశారు.

రుద్ర, చండీ హోమాలు

మహానందిలోని స్థానిక యాగశాలలో బుధవారం రుద్రహోమం, చండీహోమం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మలు భక్తుల చేత రుద్ర, చండీహోమాలను చేయించారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల ద్వారా పూజలు తిలకించారు.

సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి నీటి విడుదల



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బుధవారం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఫేజ్–2 పంప్‌హౌస్ వద్ద ప్రత్యేక పూజల అనంతరం ఆయన మోటార్లను స్టార్ట్ చేసి నీటిని విడుదల చేశారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు, సారే సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజుకు 200 క్యూసెక్కుల చొప్పున నెల రోజుల పాటు రెండు పంపుల్లో నీరు విడుదల అవుతుందన్నారు. రబీలో సాగుచేసిన పంటలకు సాగునీటికి ఎలాంటి డోకా లేదన్నారు. రైతులు నిర్భయంగా సాగు చేసుకోవచ్చన్నారు. రాబోయే రోజుల్లో పిల్ల కాలువలు పూర్తి చేసి మరో తూము ద్వారా వెంకటాపురం, కృష్ణాపురం, ఇందిరేశ్వరం గ్రామాల్లోని మరో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు.

● ఫైర్‌స్టేషన్‌ను తరలించొద్దు



శ్రీశైలం ప్రాజెక్ట్: సున్నిపెంటలో ఉన్న ఫైర్‌స్టేషన్ తరలింపు ప్రతిపాదన విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు వై.ఆశీర్వాదం, వీరయ్య, కొల్లమయ్య, కె.వెంకటేశం తదితరులు బుధవారం మండల తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. జనాభా ఎక్కువగా ఉన్న సున్నిపెంట, లింగాలగట్టు ప్రజల అవసరార్థం 55 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఫైర్‌స్టేషన్‌ను శ్రీశైలానికి తరలిస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలరి వినతి పత్రంలో పేర్కొన్నారు.

● విస్తృత పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న దేవస్థానం అధికారులు, సిబ్బంది, స్థానికులు

శ్రీశైలం టెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా బుధవారం క్షేత్ర పరిధిలో పారిశుధ్య స్వచ్ఛ సేవా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజించి ప్రతీ జోనుకు దేవస్థానం యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించి పనులు చేపట్టారు.

● పంట బీమాకు 15 వరకు గడువు



పంట పొలాల్లో రైతులకు సలహాలు ఇస్తున్న ఏడీఏ

వెలుగోడు: పంట బీమాకు ఈనెల 15 వరకు గడువు ఉందని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్‌తో కలిసి ఆయన బుధవారం వెలుగోడు, రేగడగూడూరు వేల్పనూరు గ్రామాల పరిధిలోని సాగైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకుంటేనే అతివృష్టి అనావృష్టి పరిస్థితిల్లో పరిహారం అందుతుందన్నారు. ధాన్యం కొనుగోలు, పంట బీమా, పంట రుణాలు తదితర ప్రభుత్వ సబ్సిడీలు అందుతాయన్నారు. అనంతరం రైతు సేవ కేంద్రంలో రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కేడీసీసీ బ్యాంకు, వేల్పనూరు స్టేట్ బ్యాంకు మేనేజర్లను కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు సుధారాణి, అంజిత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ రైతుసంఘం క్యాలెండర్ విడుదల



ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం –2025 క్యాలెండర్‌ను బుధవారం మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం మండలాధ్యక్షులు పి.మాబాషా, కార్యదర్శి వీరన్న, నాయకులు చిన్నఅంబయ్య, ఎ.కిరణ్, ప్రజాసంఘాల నాయకులు ఎ.రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర పాల్గొన్నారు.

'ఉపాధి' అమలుపై శిక్షణ అవసరం

నందికొట్కూరు: ఉపాధి హామీ పథకం అమలు తీరుపై ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ అవసరమని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడీ అన్వర బేగం అన్నారు. బుధవారం జీవనోపాదుల వనరుల శిక్షణ కేంద్రంలో నాలుగు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు కోర్స్ డైరెక్టర్ ఏసుదాసు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు.

వాణిజ్య కేంద్రంగా నందికొట్కూరు

విద్య, వైద్య వ్యాపార రంగాలకు నందికొట్కూరు పెట్టనికోటలా నిలుస్తోంది. విద్య సంస్థలతో పాటు, వైద్యం, బంగారు, వస్త్ర దుకాణలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో నందికొట్కూరు అగ్రగామిగా నిలుస్తోంది.

–నందికొట్కూరు



అందుబాటులో విద్య..

సామాన్య, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుబాటులో ఉంది. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించేందుకు విజయవాణి, నవనంది, శ్లోక, ఇంగ్లీషు మీడియం స్కూల్స్, నంది జూనియర్ కళాశాలలు ముందున్నాయి. విద్యలో నందికొట్కూరు పట్టణానికి చెందిన 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి, పాములపాడు మండలాలకు చెందిన వందల కుటుంబాలు పిల్లల చదువు కోసం నందికొట్కూరులో నివాసం ఉంటున్నారు. నంది జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీతోపాటు ఆయా కోర్సులకు కూడా ఏడాదికి రూ.10 వేల తక్కువ ఫీజుతో కళాశాల యజమాన్యం నాణ్యమైన విద్యనందిస్తోంది. ఈ విద్యాలయాలు సెంట్రల్ సిలబస్‌కు నిలయాలుగా మారాయి.

ఆటో మొబైల్ రంగంలో..




పట్టణంలోని బజాజ్ షోరూంతో పాటు ఆయా కంపెనీలకు చెందిన ఆటో మొబైల్స్, కార్లకు సంబంధించి మారుతీసుజికి, హ్యుండాయ్, సిప్‌టు డీజర్ మెకానిక్‌లు అందుబాటులో ఉన్నారు.

బంగారు నాణ్యతకు మారుపేరు



నందికొట్కూరు పట్టణంలో బంగారు నాణ్యతకు మారుపేరుగా నిలిచింది. పూర్వం నుంచి కూడా కొత్తపల్లి, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల మండలాల ప్రజలు నందికొట్కూరుకు వచ్చి బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నందికొట్కూరులో బంగారు విక్రయాలు నిత్యం రూ.లక్షల్లో జరుగుతూ ఉంటాయి. ఇక బంగారు దుకాణాలంటే బైరెడ్డి కాంప్లెక్స్ అని అందరికీ తెలిసిందే. ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోనే బజాజ్ షోరూం పేరు గాంచింది. అంచెలంచెలుగా బజాజ్ షోరూం ఉన్నత శిఖరాలకు ఎదిగింది.

విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం..



నందికొట్కూరు పట్టణంలో రియల్ ఎస్టేట్ రంగం రోజురోజుకు విస్తరిస్తోంది. గతంలో 40 వేలు ఉన్న జనాభా 70 వేలకు పైగా చేరడంతో అందుకు అనుగుణంగా నివాస గృహాల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. నంద్యాల రోడ్డులో నేషనల్ హైవే, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు నూతన నిర్మాణాలు ఊపందుకున్నాయి. కర్నూలు రోడ్డులోని ఆర్ఆర్ వెంచర్‌తోపాటు పలు వెంచర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కళకళలాడుతోంది. నంద్యాల–కర్నూలు రోడ్డు మధ్యలో నేషనల్ హైవే వైపు విస్తరిస్తోంది. ఈ ప్రాంతంలో పలువురు బిల్డర్లు నూతన భవన నిర్మాణాలు చేపడుతున్నారు. తాపీ మేస్త్రీలకు, వందల సంఖ్యలో కార్మికులకు పని దొరుకుతుంది.

వైద్య రంగంలో..



నందికొట్కూరు పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రజలకు కూడా కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యం అందుతోంది. అన్ని రకాల వ్యాధులకు కర్నూలు జిల్లా కేంద్రం నుంచి వైద్యులు రోజూ నందికొట్కూ రు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. వాసవి, విజయ ఆస్పత్రులతో పాటు మరో 10కి పైగా ప్రైవేట్ వైద్యశాలలు, ల్యాబ్‌లు స్కానింగ్ సెంటర్లు కర్నూలుస్థాయి వైద్య సేవలను ఇక్కడ అందిస్తున్నారు.

